క్లుప్తంగా

ముస్లింలకు సరకులు పంపిణీ



పిడుగురాళ్ల: రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు నిత్యావసర సరకులను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీకి చెందిన ముస్లిం సోదరులను గ్రామాలలో టీడీపీ నాయకులు వేధిస్తున్నారు. వారు చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్నారు. వారిని గుర్తించి ఒకచోటుకు చేర్చి రంజాన్ కావటంతో కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ బాలలకు వైద్య శిబిరం

గురజాల: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు గురువారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఝాన్సీరాణిలు బుధవారం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల భవిత కేంద్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు 16 రోజుల పండుగ

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో గురువారం 16 రోజుల పండుగ వేడుకలను నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం తెలిపారు. మహాశివరాత్రి వెళ్లిన 16 రోజుల తరువాత దేవస్థానంలో స్వామివారి కల్యాణం నిర్వహించి, అనంతరం వసంతోత్సవం జరపడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పిడుగురాళ్ల: వెనుక వడిన వర్గాలు, ఈడబ్ల్యూస్ వర్గాల కార్పొరేషన్, కాపు కార్పొరేషన్‌లో నిరుద్యోగ యువత 2024–25 ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి వయస్సు 21 – 50 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు ఫొటోతో వివరాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 22వ తేదీ వరకు గడువు పొడిగించారని తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వినతి




రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని బస్టాండ్ సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన రెంటచింతలలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రయాణికుల సమస్యలపై పాలకులు, అధికారులు దృష్టిపెట్టాలన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలు అరికట్టాలి



మాచర్ల: పట్టణంలోని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకుండా నిషేధం ఉందని, గురువారం నుంచి విక్రేతలపై దాడులు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు పేర్కొన్నారు. ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా, ఆర్వో సంధ్య, డీఈ సుభాని, ఏఈలు తేజ, జోత్స్న, సచివాలయాల అడ్మిన్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటుకు ఆమోదం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అధికారులు గ్రామస్తులతో బుధవారం సమావేశం అయ్యారు. పంచాయతీ ఏర్పాటుతో జరిగే అభివృద్ధి గురించి గ్రామస్తులకు అధికారులు తెలియజేశారు. స్థానికులు దీనికి ఆమోదించారు. కార్యక్రమంలో మాచర్ల ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఏఈ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

- కష్టాల్లో నుంచి పుట్టిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్లలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న కాసు మహేష్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల: కష్టాల్లో నుంచి పుట్టిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను కాసు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా విలేకరులతో కాసు మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన మాట కోసం, తండ్రి ఆశయాలను నిలబెట్టడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారన్నారు. వైఎస్ జగన్ రెక్కల కష్టం నుంచి పార్టీ ఆవిర్భవించిందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టంతో పార్టీని ఈ స్థాయిలోకి తీసుకొచ్చారని తెలిపారు. పార్టీ కార్యకర్తలపై, వైఎస్ జగన్‌పై ఎన్నో కేసులు పెట్టినప్పటికీ కష్టాలను ఎదుర్కొని 2019లో అధికారంలోకి వచ్చి అద్భుతమైన పాలన అందించారన్నారు. పల్నాడులో, గురజాల నియోజకవర్గంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. గతంలో వైఎస్సార్ పిడుగురాళ్లను మున్సిపాలిటీ చేస్తే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాచేపల్లి, గురజాలను మున్సిపాలిటీలుగా చేశారన్నారు. గురజాల నియోజకవర్గంలో కనీసం ఇంజినీరింగ్ కాలేజీ లేని ప్రాంతంలో మెడికల్ కాలేజీతోపాటు వైద్యశాలలను తీసుకొచ్చారని తెలిపారు. వైఎస్సార్ హయాంలో నార్కెట్‌పల్లి, అద్దంకి హైవేను తీసుకొని వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దాచేపల్లి నుంచి మాచర్లకు జాతీయ రహదారి, కొండమోడు నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారులు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో బైపాస్‌తోపాటు రైల్వే బ్రిడ్జి నిర్మాణం, పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాలకు తాగునీటి కోసం జలజీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చినట్లు వివరించారు. అలాగే జానపాడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ. 52 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గెలుపు ఓటములు ప్రజాస్వామ్యంలో సర్వసాధారణమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ అని చెప్పారని, ఆయన మాటలను నమ్మిన ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వం తీరు వెల్లడైందని పేర్కొన్నారు. కూటమికి ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. దోచుకోవడం, దాచుకోవడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పోలీసులు కావాలనే వేధించడం సరికాదన్నారు. కొంత మంది సీఐలు అదే పనిగా కొట్టడం, కేసులు పెట్టడం చేస్తున్నారని ఆరోపించారు. గతంలోలా ఈ సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉండదని గుర్తుచేశారు. నాయకులు, కార్యకర్తలను వేధిస్తే పరిస్థితులు వేరుగా ఉంటాయని పోలీసులను హెచ్చరించారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ కూడా పేర్కొన్నారని గుర్తుచేశారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే రోజు త్వరలోనే ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడేలా అందరం కలిసి కృషి చేయాలని సూచించారు. ఇద్దరు నాయకులు పార్టీని వీడినా 20 మందిని సిద్ధం చేసే సత్తా అధినేత వైఎస్ జగన్‌కు ఉందన్నారు. ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల్లో కొంత మంది కౌన్సిలర్లు పార్టీని వీడి వెళ్లారని పేర్కొన్నారు. ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడిన కౌన్సిలర్లకు తనతోపాటు ప్రతి కార్యకర్త సెల్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. కష్టాలు దిగమింగిన వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. పార్టీకి అన్యాయం చేసిన వారిని మరిచిపోయే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నరసరావుపేటలో జరిగే యువత పోరు కార్యక్రమానికి కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ, మండల కన్వీనర్‌లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశాదీపం వైఎస్సార్‌సీపీ

దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశాదీపం అని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం మండల వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. నడికుడి రైల్వేగేట్ వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను రేవతి ఎగుర వేశారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ప్రజల అభ్యున్నతికి చరిత్రలో నిలిచేలా పాలన అందించారని తెలిపారు. పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు గరిణే పుల్లారావు, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.

పేదల కోసం పుట్టిన పార్టీ

గురజాల: పేద ప్రజల కోసమే పుట్టిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని కర్రా చిన్న కోటేశ్వరరావు అన్నారు. స్థానిక జీబీసీ కాలనీలో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కల నిజం చేసేలా పాలన అందించారన్నారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి అందరం కృషి చేయాలని కోరారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కాలనీలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కర్రా గిరిబాబు, కర్రా ఇజ్రాయేలు, చాగంటి సురేష్, కోటా చందు, పిచ్చయ్య, కె విద్యాసాగర్, చాగంటి పుల్లారావు, కె.సంపత్, కె.విష్ణు, సువార్తమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పిన్నెల్లి, నాయకులు, కార్యకర్తలు



ర్యాలీ నిర్వహిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు

మాచర్ల : బడుగు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించినట్లు వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే), యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటయ్య, మాచర్ల ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, జెడ్పీటీసీ మల్లు స్వామి, కౌన్సిలర్ అనంతరావమ్మ, కార్యకర్తలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలబడిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా పేదల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తుందన్నారు. పేదల ప్రజల కోసం పలు పథకాలు, సంక్షేమం కార్యక్రమాలు అందించిన ఘనత పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తోపాటు పలు పథకాలను తుంగలో తొక్కిందన్నారు. సర్పంచ్‌లు ఒ.చిన్న, రమాదేవి, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. 30 ప్రత్యేక వాహనాల్లో వందల సంఖ్యలో నరసరావుపేటలో పోరాట కార్యక్రమానికి తరలి వెళ్లారు.

కారెంపూడిలో ఘనంగా వేడుకలు



కారెంపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సావిత్రి, చంద్రశేఖర్

కారెంపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కారెంపూడిలో బుధవారం ఘనంగా జరిగింది. కోట బురుజు సెంటర్‌లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి భారీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ తదితరులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధన కోసం ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. కేక్ కట్ చేశారు. మహిళా విభాగం నాయకురాలు కిల్లా రాణి, ఎంపీటీసీలు షేక్ ఆరీఫ్, వేముల లింగయ్య, జాన్‌పాల్ నాయక్, మామిడి శేఖర్, బొంకూరి నాగేశ్వరరావు, మైనార్టీ యువ నాయకుడు షేక్ జాని, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లి: నారాయణపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు



దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్ గేట్ వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో వైఎస్సార్‌సీపీ నేతలు



గురజాల: వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న కర్రా చిన కోటేశ్వరరావు తదితరులు



గురజాల: రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రకృతి సాగు ఎంతో మేలు



మాట్లాడుతున్న ఏపీ కె.రామమ్మ

మాచవరం: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో ప్రకృతి వ్యవసాయం చేయడం ఎంతో మేలని ఏపీ కె.రామమ్మ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను డ్వాక్రా మహిళా గ్రూపు సభ్యులకు వివరించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజనీకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.మంగమ్మ ఏపీఎం సీతారామయ్య, జిల్లా ఎస్ఎఫ్ఏ అప్పలరాజు, సైదయ్య, సిబ్బంది నందకుమార్, సౌజన్య, బాజీబాబు, రవికుమార్, సునీల్ కుమార్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మాచర్ల: పట్టణంలో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణ, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. బుధవారం పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పలు వార్డుల్లో వీధి దీపాలు, మురుగు కాల్వల నిర్మాణం తదితర సమస్యలపై చర్చించారు. మొత్తం 41 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, ఆర్వో వెంగయ్య, డీఈ సుభాని, ఏఈలు ఆదిత్య, గౌతమి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యుత్, విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు

నకరికల్లు: విద్యుత్ చౌర్యానికి పాల్పడినా, విద్యుత్ వినియోగంలో నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం పల్నాడు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నకరికల్లు, చేజర్ల, చాగల్లు, కొత్త కాలనీ, శాంతినగర్, నర్సింగపాడు, గుండ్లపల్లి, కండ్లకుంట, కుంకలగుంట, చల్లగుండ్ల, తురకపాలెం గ్రామాల్లో ఏక సమయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి మీటర్ పనితీరు, గత, ప్రస్తుత రీడింగ్, కేటగిరీ, వినియోగ అనుమతులు, బిల్లుల బకాయిలు తదితర అంశాలపై తనిఖీలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకన్న చౌదరి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబొట్లు సంయుక్తంగా 49 బృందాలతో 2,806 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 15 మందికి రూ.2.85 లక్షలు, అనుమతించిన లోడు కన్నా అదనంగా వినియోగిస్తున్న 94 మందికి రూ.2.62 లక్షలు, మీటర్ లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న 26 మందికి రూ.34 వేలు, ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.15 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. మొత్తం రూ.5.96 లక్షల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లిఖార్జున, ప్రసాద్, బి.వెంకటేశ్వరరెడ్డి, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ షేక్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన బండారు నాగలక్ష్మి మంగళవారం ఇంటికి తాళం వేసి నరసరావుపేటలో పనికి వెళ్లింది. ఈ క్రమంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు గేటు దూకి తలుపు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. 5 సవర్ల బంగారు ఆభరణాలు, 2 జతల వెండి పట్టీలు, రూ.5 వేలు అపహరించుకొని వెళ్లినట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాచవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ సురేష్ మాట్లాడుతూ రూ.15 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు మాట్లాడుతూ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు వాడుకలోకి తీసుకువచ్చి, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

15న సర్వసభ్య సమావేశం

రెంటచింతల: ఈ నెల 15వ తేదీన మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులతో వివిధ గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. గ్రామాలలో సమస్యలపైనా చర్చించనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు సన్మానం



కౌన్సిలర్లను సన్మానిస్తున్న కాసు మహేష్‌రెడ్డి, చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: అధికార పార్టీ నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురి చేసినా, భయపెట్టినా ధైర్యంగా నిలిచిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం సత్కరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో 15 మంది కౌన్సిలర్లు పార్టీ మారలేదు. కార్యక్రమంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ కన్వీనర్ కందులూరి శివయ్య, యూత్ కన్వీనర్ మందా సుధీర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సిద్దాడపు గాంధీ, కేవీ, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, సీనియర్ అడ్వకేట్ దారా చెన్నయ్య, మాచవరం జెడ్పీటీసీ జువ్విన బోయిన శివాయాదవ్, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, మహ్మద్ జాని, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులూ నిరంతరం నేర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎస్. గీత

పిడుగురాళ్ల: బోధనలో మెలకువలు అవసరమని కాంప్లెక్స్ మీటింగ్ స్టేట్ అబ్జర్వర్, విద్యాశాఖ జేడీ ఎస్. గీత అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకొని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఇందులోనూ ఎస్.గీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్య ఉంటేనే రైతులకు రాయితీలు



రెంటచింతల: రైతులకు ఇచ్చే 11 అంకెల గుర్తింపు సంఖ్య ఆధారంగానే వచ్చే ఏడాది రైతులకు రాయితీపై ఎరువులు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని పథకాలను పారదర్శకంగా అందించాలని ప్రభుత్వం ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. వివరాలకు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

15న హోలీ ఫ్యామిలీలో స్పాసెర్ 2కే25 ఎక్స్ పో

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈ నెల 15న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు స్పాసెర్– 2కే25 ఎక్స్ పో జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ విజయరాణి బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు.